క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్

బోట్‌క్లబ్: స్థానిక సూర్యనారాయణపురంలోని కంపర వీణారావు నగరపాలక సంస్థ పాఠశాల్లో గురువారం సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. స్కూల్ ఉపాధ్యాయిలు తమ పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు కావాలని కోరగా వారి కోరికపై పుస్తకాలు అందించామన్నారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ సేవలు మరువలేనివని వనమాడి మోహనవర్మ అన్నారు. అనంతరం పాఠశాలల్లో 215 మంది విద్యార్థులకు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వీరబాబు, పిడకా శేషు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి బాధాకరం

కాకినాడ సిటీ: పుంగనూరు ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంటిపై అసాంఘికంగా రాళ్ల దాడి చేయడం క్షమించరాదని కాకినాడ పౌరసంక్షేమ సంఘం కన్వీనర్, ప్రముఖ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు ఖండించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఎంపీకి రక్షణ లేకుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటన్నారు. జరుగుతున్న దురాగతం వద్ద రక్షణ వ్యవస్థ చోద్యం చూస్తూ మిన్నకుండి పోవడం దురదృష్టకరమన్నారు. దాడుల సంస్కృతిని కేంద్ర, రాష్ట్ర రక్షణ వ్యవస్థలు ఉక్కుపాదంతో కఠినంగా నియంత్రించాలన్నారు. లేకుంటే సమాజం భయభ్రాంతులతో దురవస్థ ఏర్పడుతుందన్నారు. ఎవరైనా ఏ పార్టీ అయినా అప్రజాస్వామిక చర్యలను ప్రోత్సహించరాదని రమణరాజు అన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కాకినాడ సిటీ: నియోజకవర్గంలోని 27, 28 డివిజన్లలో గురువారం నిర్వహించిన హౌసింగ్ అవేర్నెస్ ప్రోగ్రామ్‌లో టీడీపీ రాష్ట్ర పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి సుంకర పావని పాల్గొని లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను బ్యాంకులు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకుని గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసుకోవాలని ఆమె వారికి సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు, గృహనిర్మాణ లబ్ధిదారులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై హోం మంత్రికి ఫిర్యాదు

కరప: స్థానిక ఎస్సై టి.రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలం కొంగోడు గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ, పార్వతి దంపతులు గురువారం రాష్ట్ర సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి ఫిర్యాదు చేశారు. తమ కుమార్తె వెంకటలక్ష్మిని వేమగిరికి చెందిన పి.బాలకృష్ణ తన మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా బలవంతంగా పెళ్లిచేసుకుని వేధిస్తున్నాడని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని, పైగా దూషించారని ఆమెకు వివరించారు. దీనికి మంత్రి స్పందించి తగిన విచారణ చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని ఆదేశించారు. దీనిపై కరప ఎస్‌ఐ టి.రామకృష్ణను వివరణ కోరగా యువతి అదృశ్యం అని కేసు నమోదు చేశామని, వెంకటలక్ష్మి మేజర్, తన ఇష్ట ప్రకారమే పెళ్లి చేసుకున్నట్టు, లాయర్‌తో కలిసి ఇక్కడి పోలీసుస్టేషన్‌కు వచ్చి చెప్పినట్టు వివరించారు.

భౌమంటే గుండె గుభేలే..!

- స్మార్ట్ సిటీలో అంతకంతకూ పెరుగుతున్న కుక్కలు
- నియంత్రణలో మున్సిపల్ అధికారులు విఫలం
- ప్రమాదాలపాలవుతున్న ప్రజలు, చిన్నారులు



రామారావు పేట శివాలయం వద్ద కుక్కలు అటకాయించడంతో భయంతో స్కూటర్ నిలిపివేసిన మహిళ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ స్మార్ట్ సిటీలో కుక్కలు అంతకంతకూ పెరిగి ప్రాణాంతకంగా తయారయ్యాయి. కాస్తంత చీకటి పడితే చాలు పాదచారులు, వాహన చోదకుల వెంటపడి వారిని కరవడమో లేదా వారంతట వారే ప్రమాదానికి గురయ్యే పరిస్థితిని కలిగిస్తున్నాయి. గాంధీనగర్, రామారావుపేట, సూర్యారావు పేట, ఎల్విన్ పేట, ప్రతాప్ నగర్, మెయిన్ రోడ్, వార్ఫురోడ్డు, సాంబమూర్తి నగర్, శాంతినగర్, శ్రీనగర్, వెంకట్ నగర్, గైగోలుపాడు, జగన్నాథపురం, రమణయ్యపేట, సర్పవరం, రామకృష్ణారావు పేట, ఇంద్రపాలెం తదితర ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ అందోళన కలిగిస్తున్నాయి. పెద్దవారి సంగతి అటుంచితే చిన్నారులు రోడ్లపై తిరిగే సందర్భాల్లో ఆకతాయితనంగా కుక్కలను ఆటపట్టించే సందర్భాలలోనో, లేదా అవే వీరిని అటకాయించే సందర్భంలోనో ఆ చిన్నారులు గాయాలపాలవుతున్నారు. అడపాదడపా పలువురు మృత్యువాత పడుతున్నారు.

యానిమల్ బర్త్ కంట్రోల్ కమ్ యాంటీ రేబిస్ ప్రోగ్రామ్‌తో పాటు, కుక్కకాటుకు వ్యతిరేకంగా భద్రత, నివారణ చర్యలు గురించి పౌర సంక్షేమ సంఘాలతో అవగాహన కార్యక్రమాల నిర్వహణ అంతంత మాత్రంగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొందని సామాజికవేత్తలు అంటున్నారు. వీధి కుక్కలకు విచ్చల విడిగా వేటాడే స్వభావం ఉంటుందని జంతుశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. అవి సంచరిస్తున్న ప్రదేశంలో ఆహారం లభించకుంటే చిన్న చిన్న జంతువులను చంపి తింటాయని, ఆ క్రమంలో నిస్సహాయంగా ఉన్నవారిపైనా, చిన్నారులపైనా దాడులకు పాల్పడతాయంటున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం...

ప్రపంచ వ్యాప్తంగా రేబిస్ మరణాలలో 36 శాతం భారత దేశం నుంచే ఉండటం ఆందోళన కల్గిస్తోంది. అంటే 18 వేల నుంచి 20 వేల మరణాలు సంభవిస్తున్నాయి. 30 నుంచి 60 శాతం మృతుల్లో 15 ఏళ్లలోపు వారే ఎక్కువ. దేశంలో జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం–1960 ప్రాకారం జంతువులను హింసించడం, చంపడం చట్ట విరుద్ధం.



గాంధీనగర్ ఎస్‌బీఐ వీధిలో గుంపులుగా ఉన్న వీధి కుక్కలు

వాటి జనాభా తగ్గంచడం కోసం వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, టీకాలు వేయాల్సి ఉంటుంది.

వీధి కుక్కల యమ డేంజర్...

కుక్క కాటు వల్ల వైరస్ కాలు నుంచి శరీరంలోని ప్రవేశించిన తర్వాత రోజుకు ఆర సెంటిమీటరు చొప్పున పైకి ఎగబాకుతుంది. ఇది నరాలు, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. జ్వరం, తలనొప్పి, వాంతులు తొలిదశలో, పిచ్చిగా ప్రవర్తించడం, మనుషులను గుర్తించలేక పోవడం, నోటిలోంచి నురుగు రావడం, గొంతు పట్టేయడం, ఊపిరి ఆడకపోవడం వంటివి రెండో దశలో కనిపిస్తాయి. ఇక మూడో దశలో పూర్తిగా కోమాలోకి వెళ్లి, రెండు మూడు రోజుల్లో మృత్యువాత పడుతుంటారు.

చికిత్స ఇలా..



కుక్క కరిచిన వెంటనే ధారగా కారుతున్న నీటితో 10 నుంచి 15 నిమిషాల పాటు శుభ్రం చేయాలి. రక్తం కారుతున్నా గాయంపై కట్టు కట్టకూడదు. మట్టి, పసుపు, ఆకుపసరు వంటివి పోయకూడదు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కరచిన తర్వాత ఒకటి, ఆ తర్వాత 3, 7, 14, 28 రోజుల్లో వ్యాక్సిన్లు వేసుకోవాలి. నగరంలో ఎక్కడైనా వీధి కుక్కలు క్రూరంగా మారితే వెంటనే దగ్గరలోని సచివాలయానికి తెలియజేస్తే సిబ్బంది వచ్చి వాటిని పట్టుకుని ఏబీసీ చేయించి వదిలేస్తారు.

– డాక్టర్ పృథ్వీచరణ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, కాకినాడ కార్పొరేషన్

రైతు సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు, కౌలురైతు సంఘాల నాయకులు

కరప: రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయా సంఘాల ప్రతినిధులు గురువారం తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వీవీఎస్ వీరేష్‌లకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్, వ్యవసాయ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా వచ్చిన కౌలు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలుకాక నష్టపోతున్నారన్నారు. చట్టంలో మార్పులు తీసుకు వచ్చి కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీమేరకు రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తానన్న రూ.20 వేలు వెంటనే అందించాలన్నారు. ఉపాధిహామీ పథకంలో మే, జూన్ నెలలో చేసిన పనులకు ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన వేతన బకాయిలు చెల్లించాలన్నారు. ఆయా సంఘాల నాయకులు చోడిశెట్టి కృష్ణ, వాసంశెట్టి అప్పారావు, ఎస్.గణపతి, పి.ఏడుకొండలు, వై.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం భద్రం సుమా



హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు

- సురక్షితంగా గమ్యానికి చేరండి
- హెల్మెట్‌తో ప్రాణానికి భద్రత
- మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కాకినాడ మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి సూచించారు. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులు, న్యాయవాదులు గుమాస్తాలతో పాటు పోలీసులు, రవాణా శాఖ ఉద్యోగులు, వైద్యులు నినాదాలతో నడుస్తూ, బైక్ ర్యాలీతో స్థానిక కోర్టు ఆవరణ నుంచి గురువారం ప్రారంభించారు. కాకినాడలో కొన్ని ప్రాంతాల్లో హెల్మెట్ ధరించి పోలీసులు, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు బైక్ ర్యాలీ చేశారు. ర్యాలీలో 'ట్రాఫిక్ రూల్స్ పాటించండి.. సురక్షితంగా గమ్యం చేరండి, 'అతివేగం అనర్థం', 'డ్రైవింగ్‌తో చలగాటం ...మీ ప్రాణానికి సంకటం', 'అమ్మ జన్మ నిస్తుంది....హెల్మెట్ పునర్జన్మ నిస్తుంది', 'హెల్మెట్ లేకుంటే...నీ లైఫ్ రన్ అవుట్', 'హెల్మెట్ ఉంటే....రక్షణ మీ వెంటే' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కమలాదేవి మాట్లాడుతూ వాహన ప్రయాణంలో అజాగ్రత్త పనికిరాదన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాలను జడ్జి వివరించారు. ఈ కార్యక్రమానికి నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, జనరల్ సెక్రటరీ చక్కా శ్రీనివాస్, కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎస్.రమేష్, చైతన్యకృష్ణ, ఇతర శాఖల అధికారులు, కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులు గుమాస్తాలు పాల్గొన్నారు.



నినాదాలతో ర్యాలీ చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు,

21న రాయప్రోలుకు చెరుకుపల్లి పురస్కారం

బోట్‌క్లబ్: వేదవిజ్ఞాన ప్రతిష్టానమ్, అఖిలభారత జ్యోతిష్య సమాఖ్య ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా ఈ నెల 21న ప్రతిష్టానం వేద విభాగం అధ్యక్షుడు రాయప్రోలు ప్రసాద శర్మకు ప్రముఖ జ్యోతిష్య పండితుడు స్వర్గీయ చెరుకుపల్లి లక్ష్మీ నృశింహాశర్మ స్మారక పురస్కారం అందజేయనున్నారు. స్థానిక రామారావుపేటలో ఉన్న ప్రతిష్టాన భవనంలో ఈ నెల 21 ఆషాఢ పౌర్ణమి, వ్యాస పౌర్ణమి సందర్భంగా హోమం నిర్వహిస్తున్నట్టు జ్యోతిష్య సమాఖ్య రాజమండ్రి శాఖ అధ్యక్షులు పుసులూరి ఫణిశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

21న శాకంబరిగా బాలా త్రిపుర సుందరి అమ్మవారు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు ఆషాఢం సందర్భంగా ఈ నెల 21న శాకంబరిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారిని వివిధ రకాలు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లుతో సర్వాంగ సుందరంగా అలంకరించనున్నట్లు ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి గురువారం విలేకర్లకు తెలిపారు. అమ్మవారికి అలంకరణలో అవసరమైన కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు అందించే భక్తులు ఈ నెల 20వ తేదీ శనివారం సాయంత్రం లోగా ఆలయంలో అందజేయాలన్నారు.

దేశం గర్వించదగ్గ నటుడు ఎస్వీఆర్



నాగమల్లితోట జంక్షన్‌లోని ఎస్వీ రంగారావు కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పించిన కురసాల సత్యనారాయణ తదితరులు

- వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కురసాల సత్యనారాయణ
- నాగమల్లితోట వద్ద మహా నటుడికి ఘనంగా నివాళులు

కాకినాడ రూరల్: తెలుగు చిత్ర పరిశ్రమలో అద్భుత నటనతో కళాభిమానుల హృదయాలలో నిలిచిపోయిన మహానటుడు ఎస్వీ రంగారావు అని కాపునేత, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ పేర్కొన్నారు. కాకినాడలో ఎస్వీ రంగారావు 50వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నాగమల్లితోట జంక్షన్ వద్ద ఎస్వీ రంగారావు కాంస్య విగ్రహానికి కురసాల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ బందిలి వీరీష, పెదపాటి నాగబాబు, పుల్ల కోటేశ్వరరావు, శెట్టిబత్తుల కుమార్ రాజా తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ భారత దేశ గర్వించదగిన నటుడు ఎస్వీ రంగారావు అన్నారు. ఆయన నటించిన నర్తనశాల, మాయాబజార్ చిత్రాలను యువత చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్వీ రంగారావు అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో..

కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో ఎస్వీ రంగారావు వర్ధంతిని నాగమల్లి తోట వద్ద నిర్వహించారు. ఎస్వీ రంగారావు విగ్రహానికి వాసిరెడ్డి ఏసుదాసు, మాధవరావు, పట్టాభిరామయ్య తదితరులు నివాళులర్పించారు.

వ్యాన్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

కరప: మండలం పెదకొత్తూరు గ్రామం వద్ద వ్యాన్ ఢీకొట్టగా ఒక యువకుడికి తీవ్ర గాయాలపాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం ఇల్లపర్రు గ్రామానికి చెందిన కట్టా పృథ్వీనాగ్ స్థానిక వాషింగ్ మెషీన్ల సర్వీసింగ్ షాపులో పనిచేస్తున్నాడు. రామచంద్రపురంలో ఒక వాషింగ్ మెషీన్ సర్వీస్ కోసం వెళ్లి వస్తుండగా పెదకొత్తూరులోని చెరువు వద్ద ఎదురుగా పనసకాయల లోడుతో వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో అతని తలకు, ఎడమ చెవికి, ఎడమ దవడకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి సోదరుడు గూడూరి దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానాలు, డంపింగ్ యార్డులకు స్థలాలు గుర్తించండి

- తహసీల్దార్లకు ఆర్డీవో కిశోర్ ఆదేశం



తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిశోర్

కాకినాడ సిటీ: శ్మశానాలు, డంపింగ్ యార్డులకు స్థలాలు గుర్తించాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిశోర్ తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం సాయంత్రం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ డివిజన్‌లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన వర్గాలు, ఇతరులకు అవసరమైన శ్మశాన స్థలాలు అక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో వీటిని తక్షణం గుర్తించి ఆక్రమణలు తొలగించాలన్నారు. అదే విధంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థలం అవసరమైన చోట తక్షణం స్థలం గుర్తించి సర్వే చేపట్టి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ పారిశుధ్యం మెరుగుదలకు అవసరమైన డంపింగ్ యార్డులకు స్థలాలు గుర్తించాలని, రెవెన్యూ పంచాయతీ అధికారులు సమన్వయంతో పని చేసి తక్షణం అవసరమైన స్థల సేకరణ చేపట్టాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో మండల స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. వ్యవసాయ సీజన్ నేపథ్యంలో కౌలుదారులకు అవసరమైన సాగు ధ్రువపత్రాలు తక్షణం మంజూరు చేయాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో సమాచారం కోసం 97015 79666 ఫోన్ నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో కిశోర్ తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి సౌజన్య, సర్వే విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ముంపు నీటిలో నారుమళ్లు, పొలాలు



కరపలో కురుస్తున్న వర్షం

కరప: మండల పరిధిలో రెండు వారాలుగా ఆకాశం ముసురుపట్టి కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లోని శివారుప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లోని వీధులు జలమయమయ్యాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం అతలాకుతలమైంది. కరప, నడకుదురు, గురజనాపల్లి, వేములవాడ, వలసపాకల, గొడ్డటిపాలెం తదితర గ్రామాల్లో వీధుల్లో, రోడ్లపై, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, పాఠశాలల ఆవరణలో నీరునిలబడిపోయింది. కరపలో నీరు పోయే మార్గంలేక ఎంఈఓ కార్యాలయం, ఎంపీడీఓ కార్యలయం వద్ద నీరునిలబడిపోవడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బంది పడ్డారు.

పొలాలను ముంచెత్తిన నీరు..

మండల పరిధిలో కురుస్తున్న వర్షానికి తోడు పై మండలాల నుంచి ముంపునీరు వచ్చి చేరుతుండటంతో పల్లపు ప్రాంతాలు, పర్ర భూముల్లో వెదజల్లిన పొలాలు ముంపునకు గురయ్యాయి. ఊడ్చిన పొలాలు సైతం నీటమునిగాయి. మండలంలోని భూములన్నీ సముద్రతీరాన, కాలువ శివారున ఉంటాయి. పైనుంచి వచ్చే 5, 6 మండలాల్లోని ముంపునీరు శహపురం, తుల్యభాగ డ్రైన్ల ద్వారా ప్రవహించి, సముద్రంలో కలుస్తాయి. కడియం, బిక్కవోలు, పెదపూడి తదితర మండలాల్లోని ముంపునీరు వచ్చి చేరడంతో తుల్యభాగ డ్రైన్ పొంగి ప్రవహిస్తోంది. ఈ పరిస్థితులకు తోడు గురువారం నాటి భారీవర్షానికి కరప, వలసపాకల, వాకాడ, వేములవాడ, పెదకొత్తూరు, కూరాడ, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లో శివారు ప్రాంత, పర్రభూములు మునిగిపోయాయి. నారుమళ్లు, వెదజల్లిన పొలాలు, నాట్లు వేసిన పొలాలు ముంపుకు గురైనట్టు రైతులు తెలిపారు. వెదజల్లిన పొలాల్లో మళ్లీవిత్తనాలు జల్లుకోవాల్సి వస్తుందని రైతులు తెలిపారు. మెరక ప్రాంత భూములకు, కాలువ శివారు ప్రాంత భూములకు వర్షాలు ఉపయోగపడ్డాయని, వరి నాట్లు వేసుకుంటున్నట్టు రైతులు తెలిపారు.



వాకాడలో మునిగిపోయిన నారుమళ్లు, వరినాట్లు



కరప ఎంఈఓ కార్యాలయానికి వెళ్లే రహదారిలో నిలిచిన వాన నీరు



కరప హైస్కూలు ఆవరణలో పరిస్థితి ఇదీ..

మహిళలు, బాలలకు రక్షణగా 'మిషన్ శక్తి'

కాకినాడ సిటీ: మహిళలు, బాలలపై జరుగుతున్న దాడులు, లైంగిక ఇబ్బందుల నుంచి పరిరక్షించేందుకు మిషన్ శక్తి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని కాకినాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వై.లక్ష్మి అన్నారు. గురువారం సాయంత్రం కాకినాడ రూరల్ మండలం తూరంగి నాయీ బ్రాహ్మణకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు, బాలలపై జరుగుతున్న దాడులు, బాలల అక్రమ తరలింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 100 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ దృష్టికి వచ్చిన ఇటువంటి సమస్యను చైల్డ్‌లైఫ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు నేరుగా ఫోన్ చేయవచ్చన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సింహాచలం, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎస్ఎం పాల్గొన్నారు.

పటిష్ట చట్టాలు తీసుకురావాలి

ప్రగతి నారి మహిళా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం గురువారం రాష్ట్ర ఇన్‌చార్జి ముత్తాబత్తుల నాగమణి అధ్యక్షతన కాకినాడ కార్యాలయంలో జరిగింది. సమావేంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలపై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణకు పటిష్టమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో 9 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. పీఎన్ఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా బి.పద్మ, వి.మంగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కేవీవీ లక్ష్మి, అనంతలక్ష్మి, పి. వరలక్ష్మి, సరస్వతి, తులసి, మహేశ్వరి, పార్వతిలను ఎన్నుకున్నారు.



చట్టాలపై నిర్వహించిన అవగాహన ర్యాలీ

మహిళలు, బాలల చట్టాలపై అవగాహన

కాకినాడ క్రైం: కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని జీపీ-1 సెక్టార్ ఏటిమొగలో అంగన్వాడీ సూపర్‌వైజర్ బి.ప్రభావతి ఆధ్వర్యంలో గురువారం మహిళలు, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లో సదస్సులు, అనంతరం ఏటిమొగలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ, మహిళలు, బాలల భద్రత, రక్షణ కోసం న్యాయవ్యవస్థలో ప్రత్యేక చట్టాలు రూపొందించారన్నారు. మహిళలు, బాలల హక్కులు చేజారుతున్నా, వారు హింసకు గురైనా తక్షణ సాయం కోసం 1098, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. ఈ ర్యాలీలో అంగన్వాడీ వర్కర్లు పెమ్మాడి దయావతి, మల్లాడి కామేశ్వరి, ఎం.రత్నం, సుజాత, నిర్వాసితులు పాల్గొన్నారు.